జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

శుక్రవారం | 30-1-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 577 పేజీలు: 4 వెల : రూ.7







# నిధులు మళ్లింపుపై..

# మెమో సెగ!

*** శ్రీకాకుళం కార్పొరేషన్‌లో నిబంధనల ఉల్లంఘన * 001, 002 పద్దుల నిధులపై సర్కారు ఆంక్షలు * ప్రజాప్రతినిధుల ఒత్తిడితోనే బిల్లుల చెల్లింపు? * సమాధానం చెప్పలేక చేతులెత్తేసిన గత కమిషనర్ * ఏళ్ల తరబడి 'పాలక' కరువు.. అంతా ఆయన ఇష్టమే!**

**శ్రీకాకుళం, జనవరి 29 (వార్త):** శ్రీకాకుళం నగరపాలక సంస్థలో అడ్డదారిలో నిధుల వినియోగం ఇప్పుడు అధికార యంత్రాంగంలో కలకలం రేపుతోంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిధులను మళ్లించారనే ఆరోపణలపై రాష్ట్ర మున్సిపల్ శాఖ కమిషనర్ నుంచి శ్రీకాకుళం కమిషనర్‌కు మెమో జారీ అయింది. సంక్రాంతి సెలవుల కారణంగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారం ఇప్పుడు నగరపాలక సంస్థలో చర్చనీయాంశంగా మారింది.

## పద్దులు మారాయి.. నిధులు మళ్లాయి!

మున్సిపాలిటీలకు ఉన్న స్వయంప్రతిపత్తి ప్రకారం తాము వసూలు చేసిన పన్నులను సొంత అవసరాలకు వాడుకునే వెసులుబాటు ఉండేది. ముఖ్యంగా 001 పద్దు కింద ఉద్యోగుల జీతభత్యాలు, 002 పద్దు కింద నిర్వహణ ఖర్చులను చెల్లిస్తారు. అయితే, ఈ నిధులను ఇష్టానుసారంగా ఖర్చు చేయవద్దని, కేవలం జీతాలు, అత్యవసర నిర్వహణకే వాడాలని ప్రభుత్వం వీటిని 'ఫ్రీజ్' చేసింది. శ్రీకాకుళంలో కొత్త ప్రభుత్వం వచ్చే నాటికి ఈ రెండు పద్దుల్లో సుమారు 34 కోట్ల రూపాయలు నిల్వ ఉన్నాయి. దీన్ని ఆ ముఖ్య ప్రజాప్రతినిధి ఎవరి అనుమతి తీసుకోకుండానే కాంట్రాక్టర్లకు పప్పు, బెల్లం మాదిరి ఇష్టానుసారం పంచి పెట్టారు. అభివృద్ధి పనుల బిల్లుల కోసం ప్రభుత్వం 'శ్రీనిధి' పోర్టల్, సీఎఫ్‌ఎంఎస్ విధానాన్ని ప్రవేశపెట్టినప్పటికీ, స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి పెరగడంతో అధికారులు నిబంధనలను పక్కన పెట్టారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులను పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించే క్రమంలో.. ఈ ప్రత్యేక పద్దుల నుంచి సుమారు 4.50 కోట్ల రూపాయలను నిబంధనలకు విరుద్ధంగా వాడినట్లు ఇప్పటికే విచారణలో తేలింది. ఇంకా చాలా బిల్లులు చెల్లింపు కోసం ఎదురుచూస్తున్నాయి.

## ఏళ్ల తరబడి 'పాలక' కరువు.. అంతా ఆయన ఇష్టమే!

శ్రీకాకుళం నగరపాలక సంస్థకు 'ఎన్నికలు' అనే ముచ్చట జరిగి పుష్కర కాలం దాటిపోయింది. 2012 తర్వాత మళ్లీ కార్పొరేషన్ గడప తొక్కిన మున్సిపల్ చైర్మన్ గానీ, మేయర్ గానీ లేరు. పాలకవర్గం లేకపోవడంతో కార్పొరేషన్ పగ్గాలు పూర్తిగా అధికారుల చేతుల్లో ఉండాల్సింది పోయి, 'ముఖ్య' ప్రజాప్రతినిధి కనుసన్నల్లోకి చేరిపోయాయి. ఒక పక్క అధికారులు చక్రం తిప్పాలని చూస్తున్నా, అసలు చక్రం మాత్రం ఆ నేత గారే తిప్పుతున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో కౌన్సిల్ ఆమోదం పొందాల్సిన అవసరం లేకపోవడంతో, ఆయన చెప్పిందే వేదం.. వేసిందే బిల్లు అన్నట్లుగా సాగుతోంది. ఈ 'ఒక్కరి' పాలనలో అధికారులు రబ్బర్ స్టాంపులుగా మారి, నిబంధనలు తుంగలో తొక్కాల్సి వస్తోందని, ఫలితంగానే ఇప్పుడు 'మెమో'ల రూపంలో మూల్యం చెల్లించుకుంటున్నారని నగరవాసులు చెవులు కొరుక్కుంటున్నారు.

### ఒత్తిడి తట్టుకోలేక.. సెలవుపై వెళ్లిన కమిషనర్

నగరంలోని ఒక ముఖ్య ప్రజాప్రతినిధి తన అనుచరులైన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలంటూ పదేపదే ఒత్తిడి చేయడంతో మాజీ కమిషనర్ ప్రసాదరావు సందిగ్ధంలో పడ్డారు. ఒకవైపు ప్రభుత్వ నిబంధనలు, మరోవైపు ప్రజాప్రతినిధుల హెచ్చరికల మధ్య నలిగిపోయిన ఆయన, కొత్త పోస్టింగ్ రాకముందే, పండుగకు ముందు జనవరి 9వ తేదీన బాధ్యతల నుంచి తప్పుకుని రిలీవ్ అయిపోయారు. ప్రతిష్టాత్మక రథసప్తమి పనులు ఎక్కడక్కడే వదిలేశారు. ప్రస్తుతం ఇన్చార్జి కమిషనర్‌గా ఉన్న డీఈ కమలాకర్ ఈ మెమోకు పాత కమిషనర్ పనులకు వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### ప్రత్యేక ఖాతా వెనుక మర్మమేంటి?

నిర్వహణ నిధులు వాడటంపై ఆంక్షలు ఉండటంతో, మున్సిపాలిటీకి వచ్చే షాపు అద్దెల కోసం అధికారులు ఒక ప్రత్యేక ఖాతాను తెరిచారు. ఈ ఖాతాలోకి వచ్చిన అద్దె సొమ్మును నేరుగా అభివృద్ధి పనుల బిల్లుల కోసం మళ్లించినట్లు తెలుస్తోంది. దీనిపైనే రాష్ట్ర స్థాయి అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, వాటిని బేఖాతరు చేయడంపై మెమోలో తీవ్రంగా ప్రశ్నించారు.

### వివరణ ఇచ్చాం: ఇన్చార్జి కమిషనర్ కమలాకర్

రాష్ట్ర అధికారుల నుంచి మెమో వచ్చిన మాట వాస్తవమేనని ఇన్చార్జి కమిషనర్ కమలాకర్ ధృవీకరించారు. రికార్డుల్లో ఉన్న వివరాల ప్రకారం అన్ని ప్రశ్నలకు సమాధానాలు పంపామని, నిధుల వినియోగంపై పూర్తి వివరణ ఇచ్చామని ఆయన పేర్కొన్నారు.

## ఏపీవో పంగ..
# నామాలకు చెక్

*** 'జాతీయ వార్త'లో వరుస కథనాలు * తనకు టీడీపీ, వైసీపీ నేతలతో సంబంధాలు ఉన్నాయన్న ఏపీవో * అధికారులు చెప్పిన మేరకే చేశానని గొప్పలు * విచారణకు ఆదేశించిన ఉపాధి అధికారులు * త్వరలో మరిన్ని వివరాలు బయటకు వచ్చే అవకాశం**

**సంతబొమ్మాళి, జనవరి 29 (జాతీయ వార్త):** సంతబొమ్మాళి ఉపాధి హామీ పథకం ఏపీవో పంగ నరసింహమూర్తి అక్రమాలపై పత్రికల్లో వరుస వస్తున్న కథనాలు వస్తుండడంతో సంబంధిత అధికారులు ముందుకువచ్చారు. ఏపీవోపై ఎంక్వయిరీ చేస్తామని టెక్కలి డుమా ఏపీడి పి.శైలజ గురువారం మీడియాకు వివరణ ఇచ్చారు. ఎన్టీఆర్ స్వగృహ, మినీ గోకులం, హార్టికల్చర్, ఏన్యుప్లాంటేషన్, గ్రావెల్ రోడ్డు సంబంధించి పెండింగ్ బిల్లులు లబ్ధిదారులు చెల్లించకుండా రూ. 12 లక్షల 33 వేల 350 తనకు నమ్మకమైన ఫీల్డ్ అసిస్టెంట్, అధికార పార్టీ నాయకుల ఖాతాల్లోకి గత ఏడాది ఆగస్టు నెలలో ఏపీఓ నరసింహమూర్తి జమ చేయించారు. ఐదు నెలలు కావస్తున్న లబ్ధిదారులకు చెల్లించకుండా అవినీతికి పాల్పడడం, ఈ విషయం బయటకు తెలియడంతో వరుస కథనాలు పత్రికల్లో వెలువడ్డాయి. అలాగే మేఘవరం-1 ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సూరాడ శ్రీనివాస్ కుమార్ గత ఏడాది అక్టోబర్లో విదేశాలకు వెళ్లి వెల్డింగ్ పని చేసుకుంటున్నారు. అయినా అతని ఖాతాలోకి ఈ ఏడాది జనవరి వరకు ప్రతినెల రూ.9750 జీతం చెల్లిస్తున్నారు. సదరు ఫీల్డ్ అసిస్టెంట్‌తో ఏపీవో పంగ నరసింహమూర్తి ఒక అంగీకారానికి వచ్చి జీతంలో సగం ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా ఏపీవో అవినీతిపై పత్రికల్లో వరుస కథనాలు రావడంతో ఎట్టకేలకు డుమా పీడీ లవకుమార్ ఆదేశాల మేరకు త్వరలోనే ఎంక్వయిరీ చేస్తామని ఏపీడి శైలజ తెలిపారు. మరోపక్క ఇంటిలిజెన్స్ అధికారులు కూడా ఆరా తీస్తున్నట్లు సమాచారం. అలాగే పేదలకు ఉపాధి పనులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకంలో ఏపీవో పంగ నరసింహమూర్తి చేస్తున్న అవినీతిపై కొంతమంది టీడీపీ నేతలు సీఎం పేషీకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కాగా, తానేమి తప్పు చేయలేదని, తనకు టీడీపీ, వైసీపీకి చెందిన నేతలతో పరిచయాలు ఉన్నాయని పంగ చెప్పుకుంటున్నాడు. తాను పై అధికారులు చెప్పిన మేరకే నడుచుకున్నానని, జిల్లావ్యాప్తంగా ఇదే విధంగా సాగుతోందని ఉన్నతాధికారులపై తప్పును నెట్టేందుకు చూస్తుండడం గమనార్హం.





# శ్వేతగిరి.. జన ఝరి

*** శాలిహుండం యాత్రకు పోటెత్తిన భక్తులు * వైభవంగా చక్రతీర్థ స్నానఘట్టం * వేణుగోపాలస్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తజనం**



**శ్రీకాకుళం/గార, జనవరి 29 (వార్త):** శ్వేతగిరిపై వెలసిన కాళీయమర్దన వేణుగోపాలస్వామి తిరుకల్యాణ మహోత్సవంలో భాగంగా గురువారం స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. శ్వేతగిరి భక్తజన సంద్రంగా మారింది. శాలిహుండాం గోవింద నామస్మరణతో మార్మోగింది. వేలాదిమంది భక్తులు వెంటరాగా వంశధార నదిలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ అర్చకులు చక్రతీర్థ స్నానం నిర్వహించారు. కొండపైకి వెళ్లే మెట్ల మార్గాలు, ఘాట్ రోడ్డు కిటకిటలాడాయి. ఆలయ ధర్మకర్త సుగ్గు మధురెడ్డి ఆధ్వర్యంలో అర్చకుడు మహేంద్రాడ వేణుగోపాలాచార్యులు నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే గొండు శంకర్.. కాళీయమర్దన వేణుగోపాలస్వామికి పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా జిల్లా పోలీసు శాఖ పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ సీహెచ్ వివేకానంద్ దగ్గరుండి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. జనం వాహనాల్లో భారీగా తరలిరావడంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోగా, పోలీసులు స్పందించి ట్రాఫిక్‌ను క్లియర్ చేవారు. పటిష్ట భద్రతా చర్యల ఫలితంగా వంశధార నదీ తీరంలో జరిగిన చక్రతీర్థ స్నానాలు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగిశాయి.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## లోహరిబంద, అంబుగాంలో పశు వైద్య శిబిరాలు



**మందస, జనవరి 29(వార్త):** మందస, హరిపురం పశు వైద్యాధికారులు డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, డాక్టర్ కిల్లి ఉమాభారతిల ఆధ్వర్యంలో లోహరిబంద, అంబుగాం సచివాలయాల పరిధిలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమంలో రెండు సచివాలయం పరిధిలో ఉన్న గ్రామాలలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేసి, దూడలకు అంతర పరాన్నజీవులు మందులు తాగించారు. పాడి రైతులకు పశు పోషణలో తీసుకోవాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులు, పశు బీమా, పశు గ్రాసాల సాగు తదితర అంశాలను వివరించారు.

కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు దాసరి తాతారావు, అంబుగాం ఎంపీటీసీ ప్రతినిధి దున్న పురుషోత్తం, మురళి, హరికృష్ణ, బద్రి కోదండరావు, అందాల రామారావు, బొడ్డు తిరుపతి, సిబ్బంది ధర్మేంద్ర, ప్రసన్న, రవి, కళ్యాణ్, ఇంతియాజు, మురళి, నిత్యానందం, పార్వతి, రాజ్యలక్ష్మి, ఉమ, మాసయ్య, సురేష్, విజయానంద్, శ్రావణి, పాడి రైతులు పాల్గొన్నారు.

## గాయపడిన జన సైనికుడికి ఆర్థికసాయం



**మెళియాపుట్టి, జనవరి 29(వార్త):** రోడ్డు ప్రమాదంలో గాయపడిన జనసైనికుడు ముడిదాన జానకిరావుకి ఆ పార్టీ నాయకురాలు కొరికాన భవాని ఆర్థికసాయం అందించినట్లు మండల నాయకులు దుక్క బాలరాజు, సలాన అప్పలనాయుడు తెలిపారు. హీరాపురం గ్రామానికి చెందిన ముడిదాన జానకిరావు ఇటీవల ద్విచక్ర వాహనంపై వెళ్తూ.. దాసుపురం వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడిన సంగతి తెలిసిందే. ఈ విషయం నియోజకవర్గ సమన్వయకర్త కొరికాన భవాని దృష్టికి తాము తీసుకెళ్లగా, ఆమె తక్షణమే రూ.20వేల సాయాన్ని అందించారని వారు తెలిపారు. వీరి వెంట సవర రామ్మూర్తి, లక్ష్మీపురం కిరణ్, పత్రి పణికంత, కవులు శివ, దొర విజయ్, జనసైనికులు తదితరులు ఉన్నారు.

## సరుబుజ్జిలిలో రేపు విద్యుత్ అంతరాయం

**సరుబుజ్జిలి, జనవరి 29(వార్త):** సరుబుజ్జిలి ఉప కేంద్రం నందు కొత్త బ్రేకర్ అమర్చుట, లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించుట, ఇతర మరమ్మ తులు చేపడుతున్నందున శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.యోగేశ్వరరావు తెలిపారు. సరుబుజ్జిలి, షళంత్రి, కొత్తకోట, రొట్టవలస, రావివలస, వెంకటాపురం, పాలవలస, పురుషోత్తపురం, అలమజీపేట, కేజే పేట, కాగితాపల్లి, ఎరగం తెలికిపెంట, సుబ్బపేట, పెద్దసవాలాపురం, కొండ్రగూడ వెన్నెలవలస, చిగురువలస సూర్యనారాయణపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

## 'ప్రజ్ఞ' ఆధ్వర్యంలో హాకీ పరికరాల పంపిణీ




**మందస, జనవరి 29(వార్త):** నందిగాం మండలంలోని పెంటూరు గ్రామానికి చెందిన జాయి ఢిల్లేశ్వర్రావు, పుణ్యవతి దంపతులు తమ కుమార్తె 'ప్రజ్ఞ' జ్ఞాపకార్థం రూ.25 వేల విలువ చేసే హాకీ పరికరాలు వీరగున్నమ్మ పురం సమీపంలోని కస్తూరిబా విద్యార్థినిలకు అందజేశారు. ఈ సందర్భంగా నేత్ర వైద్యాధికారి రోణంకి వెంకటరమణ మాట్లాడుతూ ప్రజ్ఞ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో హాకీ టీంనకు అవసరమైన ఆర్థికసాయం కూడా అందజేస్తామన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రజ్ఞ హెల్పింగ్ హ్యాండ్స్ సేవా నిరతిని కొనియాడారు. పీఈటీ సంతోషిని మాట్లాడుతూ మంచి హాకీ టీంను తయారుచేస్తానన్నారు. కార్యక్రమంలో జాయి వాసుదేవరావు, పుష్పలత, ఎస్.భాగ్యలక్ష్మి, ఎల్.లలితకుమారి, ఎం.ఇంద్రావతి, భవాని, లావణ్య, మీనా, ఉమాసుందరి, భాగ్యలక్ష్మి, పావని, అశ్విని, శ్రావణి, ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు శంకరరావు మృతి



**మందస, జనవరి 29(వార్త):** తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు, యూనిట్ కన్వీనర్ సవర శంకరరావు గురువారం మృతి చెందారు. కుల్లోగాం గ్రామానికి చెందిన ఆయన తెలుగుదేశం పార్టీలో సీనియర్ నాయకునిగా, గౌతు కుటుంబానికి సన్నిహి తునిగా, అభిమానిగా పార్టీకి మంచి సేవలు అందించారు. తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, నాయకులు ..శంకరరావు అకాల మరణం మమ్మల్ని ఎంతగానో దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. పార్టీలో ఆయన లేని లోటు పూడ్చలేనిదన్నారు. శంకరరావు పవిత్రమైన ఆత్మకి శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం కల్పించాలని కోరారు. తెలుగుదేశం పార్టీ తరుపున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని తెలిపారు.

## సిక్కోలు ఉద్దానం సేవా సమితి ఆధ్వర్యంలో..
## 4072 సేవా కార్యక్రమాలు




**మందస, జనవరి 29(వార్త):** సిక్కోలు ఉద్దానం సేవా సమితి ఆధ్వర్యంలో 4072 సేవా కార్యక్రమాలు నిర్వహించామని నిర్వాహకులు చెప్పారు. నిత్య అన్నదానాన్ని కొనసాగిస్తున్నామన్నారు. రోడ్డుపై ఉండే అనాథలకు, అభాగ్యులకు గురువారం అన్నదానం చేశామన్నారు. ఎవరివైనా పెళ్లి రోజులు, పుట్టిన రోజులు, వేడుకలు జరిగితే అనవసర ఖర్చులు పెట్టకుండా ఆకలితో ఉన్నవారికి ఒక్క పూట అన్నం పెట్టాలని కోరారు. జిల్లాలో ఎవరికైనా అంబులెన్సు సర్వీస్ కావాలంటే సిక్కోలు ఉద్దానం సేవా సమితి, 7207119285 అనే ఫోన్ నెంబర్ సంప్రదించాలని వారు కోరారు.

## స్నేహకు అభినందనల వెల్లువ

**కంచిలి, జనవరి 29 (వార్త):** పెద్ద శ్రీరాంపురం గ్రామానికి చెందిన స్నేహ గ్రూప్2 ఫలితాల్లో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా ఎంపికైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమెకు అనేకమంది శ్రేయోభిలాషులు స్నేహితులు బంధువులు ప్రజాప్రతినిధుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. కంచిలి మండల టిడిపి అధ్యక్షుడు మాదిన రామారావు గురువారం స్నేహ ఇంటికి వెళ్లి ఆమెకు దుశ్శాలవాతో సత్కరించి అభినందించారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టి తల్లిదండ్రులకు గ్రామానికి మంచి కీర్తి ప్రతిష్టలు తెచ్చిన స్నేహ నిరుద్యోగులకు స్ఫూర్తి అని కొనియాడారు. కార్యక్రమంలో పెద్దలు ప్రసాదరావు, కామేశ్వరరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# జగ్గుశాస్త్రులపేటలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్



ఆంధ్ర ప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ
Eastern Power Distribution Company of Andhra Pradesh Limited

ABSTRACT

APEPDCL – Detailed estimate for erection of 1No. New 33/11KV Jaggu Sastrulapeta SS with 1x5 MVA PTR, 11KM 33KV Line and 0.7KM of 11KV Line in Operation Section Amadalavalasa of Amadalavalasa Subdivision in Srikakulam Division of Operation Circle Srikakulam for an amount of Rs.3,86,06,486.00 (Rupees Three Crores Eighty Six Lakhs Six Thousand Four Hundred and Eighty Six Only) (Gross & Net) under System Improvements – Administrative Approval – Accorded – Reg.

E.O.O.(CGM-O&CS) Ms.No. /2025 Dated: .2025
Read the Following:
Ref:- 1) E.O.O. (CS) Ms. No. 143/2023, Dt: 23.08.2023
2) Note orders Dt: of the Chairman & Managing Director, APEPDCL

ORDER:
1. APEPDCL hereby accords Administrative Approval for Detailed estimate for erection of 1No. New 33/11KV Jaggu Sastrulapeta SS with 1x5 MVA PTR, 11KM 33KV Line and 0.7KM of 11KV Line in Operation Section Amadalavalasa of Amadalavalasa Subdivision in Srikakulam Division of Operation Circle Srikakulam for an amount of Rs.3,86,06,486.00 (Rupees Three Crores Eighty Six Lakhs Six Thousand Four Hundred and Eighty Six Only) (Gross & Net) under System Improvements as per the proposal submitted by Superintending Engineer/ Operation/Srikakulam.
2. The expenditure is chargeable to APEPDCL under Capital Works in Progress (CWIP) account No. 1400101.
3. The Technical Sanction may be accorded by the Competent Authority. This order is issued with the concurrence of Director/ Finance.
4. The works will be executed by the Superintending Engineer/Operation/ Srikakulam after sanction of the detailed working estimate by the competent authority after ensuring budget provisions.

(BY ORDER AND IN THE NAME OF EASTERN POWER DISTRIBUTION COMPANY OF A.P.LIMITED)

//Approved by//
Chairman & Managing Director
APEPDCL :: Visakhapatnam

To
The Superintending Engineer/Operation/Srikakulam
Copy to:
The Executive Engineer/Operation/ Srikakulam

**-రూ.3.86 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం**

**-ఫలించిన ఎమ్మెల్యే రవికుమార్ కృషి**

**-తీరనున్న ఆమదాలవలస పట్టణ ప్రజల విద్యుత్ కష్టాలు**

**ఆమదాలవలస, జనవరి 29(వార్త):** ఆమదాలవలస నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తూ, ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్‌ని ప్రజలు అభినందిస్తున్నారు. ఆయన కృషి ఫలితంగా జగ్గుశాస్త్రులు పేటలో 33/11 కేవీ ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.86 కోట్లు గురువారం మంజూరు చేసింది. ఈ సబ్ స్టేషన్ నిర్మాణంతో



పరిసర గ్రామాల ప్రజలకు నిరంతరాయంగా, ఆటంకం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి రానుంది. కొంతకాలంగా విద్యుత్ లోపాలతో రైతులు, పరిశ్రమలు, గృహ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలకు ఈ సబ్ స్టేషన్ శాశ్వత పరిష్కారంగా నిలవనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో విస్తారంగా డ్రై ల్యాండ్స్ ఉండటంతో పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు అనుకూల వాతావరణం ఉందన్నారు. తక్కువ పెట్టుబడితోనే పరిశ్రమలకు అవసరమైన నాణ్యమైన విద్యుత్ లభించనుందని తెలిపారు. దీంతో పారిశ్రామిక అభివృద్ధి వేగంగా జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. వ్యవసాయం, చిన్న పరిశ్రమలు, వాణిజ్య రంగం మరింత బలోపేతం కావడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభించనుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ కృషిని జగ్గుశాస్త్రులు పేటతో పాటు పరిసర గ్రామాల ప్రజలు హర్షాతిరేకాలతో కొనియాడుతూ, కృతజ్ఞతలు తెలియజేశారు.

## బొగాబందలో 'నవజ్యోతి' చీరలు, దుప్పట్ల పంపిణీ




**మందస, జనవరి 29(వార్త):** బొగాబందలోనవజ్యోతి సేవాసమితి ప్రతినిధులు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. మందస మండలంలోని బొగాబందలోని యోగాశ్రమంలో 42మందికి నవజ్యోతి సేవాసమితి సౌజన్యంతో బొగాబందలో మహిళలకు చీరలు, పురుషులకు దుప్పట్లు సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ కుమార్ నాయక్ అధ్యక్షతన పంపిణీ జరిగింది. రంగోయి గ్రామానికి చెందిన మచ్చ జోగారావుదాసుడు చీరలు, దుప్పట్లు ఉచితంగా అందించారు. అధ్యక్షత వహించిన నవజ్యోతి సేవాసమితి అధ్యక్షుడు కుమార్ నాయక్ మాట్లాడుతూ పల్లె ప్రజల్లో ఉన్న ఆప్యాయత, సేవా తత్పరత, స్నేహశీలత, మర్చిపోలేనిదని, నిరుపేద నిరాశ్రయ వృద్ధులకు, విభిన్న ప్రతిభావంతులకు, వస్త్ర పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీజేపీ జిల్లా యువమోర్చా అధ్యక్షుడు లక్కోజు ధర్మారావు మాట్లాడుతూ ఇటువంటి సేవా కార్యక్రమాలు నవజ్యోతి సంస్థ చేపట్టడం హర్షదాయకమన్నారు. సోషల్ వర్కర్ హనుమంతు మురళీమోహన్ దొర మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో భీష్మఏకాదశి రోజున అన్నసంతర్పణ జరపడం శుభపరిణామం అన్నారు. ఒడియా కళాకార్ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నల్ల తిరుపతి, ఆశ్రమ పీఠాధిపతి మాతాజీ లక్ష్మీబాయి, నవ జ్యోతి సేవాసమితి ప్రధాన కార్యదర్శి భాష్యం రవికుమార్ , కోశాధికారి పక్కల్లా రాజేంద్ర, సభ్యులు కొండల ప్రకాష్, శిల విజయ్ కుమార్, శంభో ప్రసాద్ సాహూ, షేక్ రాజా, పశు వైద్యాధికారి డాక్టర్ వెంకటరావు, డోల తిరుపతినాయుడు, సర్పంచ్ ప్రతినిధి రౌతు దుర్యోధన తదితరులు పాల్గొన్నారు.

# పీఆర్‌సీ, ఐఆర్ మంజూరుకు పోరాడదాం



**సరుబుజ్జిలి, జనవరి 29(వార్త):** నూతన పీఆర్‌సీ ఏర్పాటు, 34 వేల కోట్ల బకాయిల చెల్లింపు, ఉద్యోగ, ఉపాధ్యాయులకు 4 డీఏలు చెల్లించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైనందున, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం దశల వారీ పోరాటాలకు పిలుపునిచ్చింది. గురువారం రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ దశల వారీ పోరాట కరపత్రాన్ని ప్రధానోపాధ్యాయులు కె.రామకృష్ణారావు, ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర నాయకులు ఎస్వీ రమణమూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వం 23 వేల కోట్ల ఉపాధ్యాయ ఉద్యోగులకు బకాయిలు ఉండగా,ఈ ప్రభుత్వం దాన్ని చెల్లించకపోగా, మరొక 10 కోట్లకు పెంచిందని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా చెల్లించాల్సిన కరువు భత్యం కూడా అరువు భత్యం చేస్తున్నటువంటి పరిస్థితి దాపురించిందన్నారు. వెంటనే నూతన పీఆర్‌సీని నియమించి 30% మధ్యంతర భృతి చెల్లించి, పెండింగ్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ సమస్యల సాధనకు దశలవారీ పోరాటంలో భాగంగా 30న అన్ని మండల తహసీల్దార్లకు వినతి పత్రాల సమర్పణ, ఫిబ్రవరి 10న అన్ని జిల్లా కలెక్టరేట్లో ధర్నా, ఫిబ్రవరి 25న చలో విజయవాడ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలియజేశారు. ఈ పోరాటంలో రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

# అక్షరాంధ్ర యాప్‌లో శత శాతం నమోదు చేయాలి




**మందస, జనవరి 29(వార్త):** వయోజన విద్యాశాఖ ద్వారా అమలవుతున్న ఉల్లాస్ పథకం(అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) వలంటీర్లు, అభ్యాసకుల అందరి పేర్లు కూడా సచివాలయ పరిధిలోగల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ లాగిన్ ఆన్లైన్లో అక్షరాంధ్ర యాప్ లో నమోదు చేయాలని వెలుగు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మా రావు తెలిపారు.

మందస మండల పరిధిలో గల కొంకడాపుట్టి గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. మందస మండలం నిరక్షరాస్యులులో స్వయం సహాయక సంఘాల మహిళల నుండి 2,600 మంది ఉపాధి హామీ కూలీల నుండి పురుషులు 1,400 మంది మొత్తం 4,000 మందిని త్వరితగతిన నమోదు చేయించాలన్నారు. ప్రతీ పదిమంది నిరక్షరాస్యలకు స్వచ్ఛందంగా బోధించేందుకు ఒక వలంటీర్ చొప్పున 400 మంది వాలంటీర్లను నమోదు చేయాలని వివరించారు. గ్రామాలలో ఖాళీ సమయంలో ఆటపాటలతో పాటు పరిసరాలు, బొమ్మలను చూపిస్తూ, ఆరోగ్య విద్య, సామాజిక, పారిశుధ్య అంశాలు, కొద్దిపాటి లీగల్ లిటరసీ, డిజిటల్ లిటరసీ, బ్యాంకింగ్ తదితర ప్రభుత్వ కార్యాలయాలపై వారికి కనీసం 100 గంటల అవగాహన అనంతరం అభ్యాసకులకు పరీక్షలు కూడా నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు కంప్యూటర్ ఆపరేటర్ రాజారావు తో పాటు గ్రామ సంఘం వీవోఏలు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లెక్సీల రగడపై స్పందించిన పాలకవర్గం



**నరసన్నపేట, జనవరి 29(వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలోని డివైడర్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై ఏర్పడిన రగడపై గ్రామపంచాయతీ పాలకవర్గం స్పందించింది. ఈ విషయమై సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు గురువారం ప్రెస్ మీట్ నిర్వహించి తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఫ్లెక్సీల తొలగింపు ప్రక్రియపై ఈవోపై ఒత్తిడి తేవడం ఫిర్యాదుదారుడికి తగని చర్యగా పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఉన్న ఈవోకు పాలకవర్గం పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో పంచాయతీ పరిధిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా గ్రామపంచాయతీ అనుమతి పొందాల్సిందేనని తీర్మానం చేస్తామని తెలిపారు. నిబంధనల ప్రకారం వ్యవహరించడమే అందరికీ మేలు చేస్తుందని పాలకవర్గం ఈ సందర్భంగా పేర్కొంది.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత




**నరసన్నపేట, జనవరి 29(వార్త):** నరసన్నపేట డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ పెద్దాడ లత ప్రారంభించారు. అధ్యాపకులు, విద్యార్థులు కలిసి వివిధ రకాల 100 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పెద్దాడ లత మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యాన్ని కాపాడటానికి చెట్లు, మొక్కలు ఎంతో అవసరమన్నారు. వాతావరణ పరిరక్షణకు తోడ్పడటమే కాకుండా మానవేతర జీవరాశులకు చెట్లు ఆవాసాలుగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు మొక్కలు నాటడాన్ని బాధ్యతగా భావించాలని ఆమె సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ్ మాట్లాడుతూ, భూగోళ ఉష్ణతాపాన్ని తగ్గించడంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. నాటిన మొక్కల సంరక్షణ కూడా అంతే ముఖ్యమని, విద్యార్థులు వాటి పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## లకిమేర పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ



**నరసన్నపేట, జనవరి 29(వార్త):** కోమర్తి పంచాయతీ లకిమేరలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-1 ఉప్పాడ శాంతారావు గురువారం పరిశీలించారు. ఆయన తరగతులను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను ఒక్కొక్కరిని ప్రశ్నించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రతిరోజూ ఉపాధ్యాయులు ఇచ్చే హోం వర్క్‌ను తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే పాఠ్యాంశాల వివరాలను వర్క్‌బుక్స్‌లో సక్రమంగా నమోదు చేసుకోవాలని విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. ఉపాధ్యాయులు బోధన నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాఠశాలలోని మౌలిక వసతులను క్రమం తప్పకుండా పరిశీలించి లోపాలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రగతికి ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని ఎంఈఓ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## మహోత్సవాలు ..వార్షికోత్సవాల్లో ఎమ్మెల్యే

**పోలాకి, జనవరి 29(వార్త):** మబగాంలో కాళీయామర్ధన వేణుగోపాల స్వామి వారి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సైనిక ఉద్యోగులు ఏర్పాటు చేసిన అన్నదానంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. మాజీ సైనిక ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గోపాలపెంటలో నిర్వహించిన యాళ్ల రాములమ్మ బాల పేరంటాలు 69వ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమాల్లో కూటమి నాయ కులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## డిప్యూటీ తహసీల్దార్‌గా మణికంఠ ఎంపిక



**నరసన్నపేట, జనవరి 29(వార్త):** నరసన్నపేట పట్టణం మారుతీ నగర్‌కు చెందిన దుంప మణికంఠ డిప్యూటీ తహసిల్దార్ ఉద్యోగాన్ని సాధించి పట్టణానికి గర్వకారణంగా నిలిచారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) విడుదల చేసిన గ్రూప్--2 ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి ఈ విజయాన్ని నమోదు చేశారు. ఈ సందర్భంగా మణికంఠ మాట్లాడుతూ, నిరంతర శ్రమ, క్రమశిక్షణతో కూడిన చదువే ఈ ఫలితానికి కారణమని తెలిపారు. ప్రస్తుతం యూపీఎస్సీ పరీక్షల కోసం కూడా స్వతహాగా సన్నద్ధమవుతూ చదువు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. మణికంఠ తల్లిదండ్రులు సీతారామరాజు, లక్ష్మీ తమ కుమారుడి విజయంపై ఆనందం వ్యక్తం చేయగా, మారుతీ నగర్‌తో పాటు పట్టణవాసులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ విజయం యువతకు ఆదర్శంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

# అపవిత్ర రాజకీయంపై 'ఆధ్యాత్మిక' విజయం

- లడ్డూ వివాదంలో అబద్ధాలు వీడాయి.. నిజాలు నిలబడ్డాయి
- చంద్రబాబు 'డైవర్షన్' పాలిటిక్స్ ఇక సాగవు
- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- నీలమణి దుర్గమ్మకు108 కొబ్బరికాయలు సమర్పణ



**కొత్తూరు, జనవరి 29(వార్త):** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై కొంతకాలంగా సాగుతున్న అపవిత్ర రాజకీయాలపై ఎట్టకేలకు ఆధ్యాత్మిక విజయం లభించిందని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు, పాతపట్నం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. లడ్డూ వివాదంలో కూటమి ప్రభుత్వం చేసిన ఆరోపణలు అబద్ధాలని తేలిపోయాయని, సత్యం గెలిచినందుకు కృతజ్ఞతగా ఆమె గురువారం పాతపట్నంలోని నీలమణి దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి, అమ్మవారికి కృతజ్ఞతలు తెలుపుతూ 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా రెడ్డి శాంతి మీడియాతో మాట్లాడుతూ.. "శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన ఆరోపణలు కేవలం రాజకీయ డైవర్షన్ కుట్రలేనని స్పష్టమైంది. ఐసీఈఆర్, ఎన్డి, డివి ల్యాబ్‌లలో జరిగిన పరీక్షల నివేదికలను సిబిఐ క్షుణ్ణంగా పరిశీలించిందన్నారు. వైఎస్ఆర్సీపీ హయాంలో వాడిన నెయ్యిలో ఎలాంటి అపవిత్రత లేదని శాస్త్రీయంగా తేలిపోయిందన్నారు. భక్తుల మనోభావాలతో ఆడుకున్న చంద్రబాబు కుతంత్రం అట్టర్ ఫ్లాప్ అయ్యింది" అని ఆమె పేర్కొన్నారు. తన పాలనలోని వైఫల్యాల నుంచి, ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత నుంచి దృష్టి మళ్లించేందుకే చంద్రబాబు ఈ 'లడ్డూ డ్రామా' ఆడారని రెడ్డి శాంతి విమర్శించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి పవన్ కళ్యాణ్ కూడా ఈ అసత్య ప్రచారానికి వత్తాసు పలకడం దురదృష్టకరమని ఆమె మండిపడ్డారు. ఇంతలా నిజాలు నిర్భయంగా బయటకు వచ్చినప్పటికీ, పాతపట్నం నియోజకవర్గంలో కొందరు టీడీపీ నాయకులు ఇంకా బుద్ధి తెచ్చుకోకుండా తప్పుడు ప్రచారాలు కొనసాగిస్తున్నారు. పనిగట్టుకుని ఆలయ మెట్లు కడుగుతూ ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారన్నారు. భగవంతుడి పేరుతో రాజకీయం చేసే వారికి ఆ దేవుడే తగిన బుద్ధి చెబుతాడని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక హారతులు సమర్పించారు.

## మహమ్మద్‌పురం పాఠశాల తనిఖీ



**జలుమూరు, జనవరి 29(వార్త):** మహమ్మద్‌పురం ప్రభుత్వ పాఠశాలను ఎంఈఓలు బమ్మిడి మాధవరావు, ఎంవీఆర్ఎస్ ప్రసాదరావు గురువారం సందర్శించారు. ఉదయం పాఠశాలకు చేరుకున్న వారు విద్యా సంబంధిత రికార్డులను పరిశీలించి, బోధనా విధానాలు, విద్యార్థుల హాజరు తదితర అంశాలపై ఉపాధ్యాయులకు సూచనలు అందజేశారు. అనంతరం తరగతులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడిన ఎంఈఓలు, బోధన ఏ విధంగా కొనసాగుతోందో తెలుసుకున్నారు. విద్యార్థులకు సత్ఫలితాలు అందేలా నాణ్యమైన బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలవుతుందో లేదో పరిశీలించి, నిబంధనల ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా ఎంఈఓలు సూచించారు.

## పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి




**పోలాకి, జనవరి 29 (వార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి చింతాడ షణ్ముఖరావు తెలిపారు. పోలాకి మండలం కోడూరు పంచాయతీలో గురువారం నిర్వహించిన పశు వైద్య శిబిరంలో పశువులకు అవసరమైన వైద్య సేవలు అందించారు. ఈ శిబిరంలో 34 పశువులకు గర్భకోశ చికిత్సలు, 64 దూడలకు నట్టల నివారణ మందులు, 450 గొర్రెలకు షీప్ ఫాక్స్ టీకాలు వేయడం జరిగిందని ఆయన వివరించారు. పశువుల ఆరోగ్య సంరక్షణతో పాటు రైతుల ఆర్థికాభివృద్ధికి ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొర్లి దాలయ్య, పాడి రైతులు, పశు వైద్య సిబ్బంది పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు. రైతులు తమ పశువులకు సమయానుకూలంగా వైద్య సేవలు అందించుకోవాలని అధికారులు కోరారు.

## కె.శాసనంలో ఉపాధి పనుల ప్రారంభం




**ఇచ్ఛాపురం, జనవరి 29 (వార్త):** కే.శాసనం గ్రామంలో లో ఉపాధి హామీ పథకం పనులు ఎంపిపి బోర పుష్ప ప్రారంభించారు.పెదిని గౌరమ్మ పొలంలో ఫారం పాండ్ పనులుప్రారంభం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ త్రినాథరెడ్డి పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత



**పలాస, జనవరి 29 (వార్త):** ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ ఆరో వార్డు పెసరపాడు గ్రామంలో శిరిడి సాయి మందిరం వార్షికోత్సవ కార్యక్రమంలో గురువారం మున్సిపల్ చైర్మన్ పాల్గొని, అనంతరం నెమలి కొండపై ఉన్న దత్తాత్రేయ ఆశ్రమంలో బిస్మా ఏకదశి సందర్భంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన తోనే ధ్యానం, జపం ద్వారా మనసును ప్రశాంతంగా చేస్తుందని చెప్పారు. ఇది కార్టిసాల్ హార్మోన్ స్థాయిలను తగ్గించి, ఏకాగ్రత, స్మృతి శక్తిని పెంచుతుందని, భగవద్గీతలోని బోధనలు కోపం, భయాలను అధిగమించి సమానత్వాన్ని అందిస్తాయని వెల్లడించారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ నెమలికొండపై భీష్మ ఏకాదశి సందర్భంగా వెంకటేశ్వర ఆలయం వద్ద అన్న ప్రసాద కార్యక్రమంలో చైర్మన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రతినిధి దున్న సత్యం, వల్లభ వైకుంఠ రావు, డబ్బీరు నాగభూషణం, పి లక్ష్మణరావు, వల్లభ రావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా గోదానం



**ఇచ్ఛాపురం, జనవరి 29(వార్త):** మారుతి జ్యోతిర్విద్యానిలయం, గ్రంథాలయం గోశాల నిర్వాహకులు దైవజ్ఞ తెన్నేటి తేజేశ్వర శర్మ ఆధ్వర్యంలో గోదాన వ్రతం నిర్వహించారు. మాఘమాసమును పురస్కరించుకుని ఒక గుప్త భక్తదంపతులు హర్యానాకు చెందిన చూలియైన గోమాతను ఒరిస్సా గోపాలపల్లి నుండి మాఘ శుద్ధ విదియనాడు కొనుగోలు చేశారు.దాత ఉభయతోముఖీ గోదానమును చేయుటకు సంకల్పించినా శ్రీపంచమి గురువారం సంధ్యాసమయంలో గోవు ప్రసవవేళ కష్టమవడం వలన వెటర్నరీ డాక్టర్ అఖండం ఎస్. కె. ఎస్. పవన్ కళ్యాణ్ వచ్చి గోమాతకు సహాయం చేసి మాన్యువల్ గా ప్రసవం చేయించి గోమాతను గోవత్సను కాపాడారు. ఆ సమయంలో దాత సంకల్పపూర్వకంగా గోదానం నిర్వహించారు. రథసప్తమి రోజున గోవు పాలతో క్షీరాన్నమునుసూర్యనారాయణమూర్తికి నివేదించి పూజించారు, భీష్మ ఏకాదశి రోజున గోదానం చేశారు.

## గోవిందపురం శ్మశానవాటిక అభివృద్ధి

**పలాస, జనవరి 29 (వార్త):** గ్రామ గౌరవాన్ని, సంప్రదాయాన్ని కాపాడే దిశగా వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం గ్రామంలో స్మశానవాటిక అభివృద్ధికి చారిత్రాత్మక అడుగు పడింది. పూండి మదర్ థెరిస్సా సేవా సంస్థ ఆధ్వర్యంలో అధ్యక్షులు పుచ్చ ఈశ్వరరావు, ఉపాధ్యక్షులు కర్ని రమణ నాయకత్వంలో సొంత నిధులతో జెసిబి పెట్టి స్మశానవాటిక ప్రాంతాన్ని పూర్తిగా చదును చేశారు. స్మశానవాటిక చుట్టుపక్కల భూములు కలిగిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారిని పిలిపించి, సర్వే నిర్వహించి అధికారికంగా హద్దులు నిర్ణయించి హద్దు రాళ్లు పెట్టి భవిష్యత్తులో ఎలాంటి భూసంబంధిత సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అతి త్వరలో మట్టి వేసి స్మశానవాటిక ఎత్తును పెంచడం, చుట్టూ ప్రహరీ గోడ నిర్మించడం, కూర్చోవడానికి సిమెంట్ బెంచీల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ అభివృద్ధి పనులన్నీ దశలవారీగా పూర్తి చేయనున్నామని స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధి పట్ల ఆసక్తి ఉన్న దాతలు ముందుకు వచ్చి ఈ అభివృద్ధి కార్యక్రమంలో పాలుపంచుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. దాతల సహకారంతో స్మశానవాటికను మరింత సౌకర్యవంతంగా, గౌరవప్రదంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు విఘ్నేష్, గణేష్, శంకర్, గ్రామ రైతులు మోహనరావు, చిన్నబాబు, అప్పారావు, రమణ, గ్రామ పెద్దలు కామేష్, వైకుంఠరావు, తులసి, సూరి, రాము, గోవింద, మోహన్ తదితరులు పాల్గొని తమ సహకారం అందించారు.



# ఘనంగా భీష్మ ఏకాదశి వేడుకలు



**సోంపేట, జనవరి 29(వార్త):** భీష్మ ఏకాదశి వేడుకలు సోంపేటలో పలు దేవాలయాల్లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంలోనూ, శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలోనూ, శ్రీ కోదండరామ ఆలయంలోనూ ఏకాదశి వేడుకలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వేకువజాము నుంచి భక్తులు ఆలయాల్లో స్వామివారి దర్శనానికి క్యూ కట్టారు. వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం ఐదు గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆరు గంటల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దర్శనం అనంతరం భక్తులకు తీర్థం ప్రసాదం అందజేశారు. ఆలయ ధర్మకర్త పొందూరు తిరుపతిరావు ఆధ్వర్యంలో విశేష పూజలతో పాటు సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం ఆలయంలో ఘనంగా జరిగింది. సత్యనారాయణ స్వామి ఆలయంలోనూ అభిషేకాలు పూజలు ప్రసాద వితరణ విష్ణు సహస్ర పారాయణం నిర్వహించారు. అలాగే కోదండరాం స్వామి ఆలయంలోనూ స్వామివారికి విశేష పూజలు పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులకు దర్శనాలు అనంతరం ప్రసాద వితరణ విష్ణు సహస్రనామ పారాయణం ఘనంగా జరిగింది.

### సాధు మెట్టపై భారీ స్థాయిలో...

బెంకిలి గ్రామ సమీపంలో కురస్వామి ఆశ్రయం లో సాధుమట్టపై భీష్మ ఏకాదశి వేడుకలు ఆలయ ధర్మకర్త లక్ష్మీనారాయణ పాత్రో ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి మెట్ట పైకి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ ఆవరణలో యజ్ఞ హోమాన్ని నిర్వహించడంతో విచ్చేసిన భక్తులు యజ్ఞంలో పాల్గొన్నారు. మెట్టపై వలసిన శ్రీ అభయాంజనేయ స్వామిని కుర స్వామి విగ్రహాన్ని దర్శించుకుని పూజలు చేశారు. వేలాది మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ పెద్ద ఎత్తున నిర్వహించారు.

# గ్రామీణ రహదారుల అభివృద్ధికి కట్టుబడ్డాం



**నరసన్నపేట, జనవరి 29(వార్త):** కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామీణ రహదారుల అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నామని నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి తెలిపారు. గురువారం నరసన్నపేట మండలం కిల్లాం నుంచి మాకివలస వరకు రూ. కోటి 10 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రహదారి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుందని, రవాణా సౌకర్యాలు పెరగడం ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బోడి రామన్న, ఉప సర్పంచ్ పొట్నూరు సత్యనారాయణ, సంబంధిత శాఖ అధికారులు పాల్గొని పనుల వివరాలను వెల్లడించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా తెలియజేశారు.

## భీష్మ ఏకాదశి వేడుకల్లో ప్రజాప్రతినిధుల సందడి



**నరసన్నపేట, జనవరి 29(వార్త):** గోపాలపెంట గ్రామంలో భీష్మ ఏకాదశి సందర్భంగా యాళ్ల రాములమ్మ బాల పేరంటా 69వ వార్షికోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా తెలుగుయువత అధ్యక్షులు మెండ దాసు నాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ మండల అధ్యక్షులు, నీటి సంఘం అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ సాధు గరికయ్య, గ్రామ అధ్యక్షులు గడిలి ఈశ్వరరావు పాల్గొని దేవాలయ అభివృద్ధికి తమ సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యువ నాయకులు కంచి నీలం, మార్పు గోవింద రావు, బడ్డ వసంత, మార్పు సతీష్, గడిలి రాజేష్, గడిలి వెంకటేష్ తదితరులు పాల్గొని భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, ప్రజలు, నాయకులు, యువత కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ వార్షికోత్సవ వేడుకలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ఇలాంటి సంప్రదాయ పండుగలు గ్రామీణ సాంస్కృతిక విలువలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



**జలుమూరు, జనవరి 29(వార్త):** ఆధ్యాత్మిక చింతన ద్వారానే ప్రతి వ్యక్తిలో మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని ఆనందాశ్రమ పీఠాధిపతి స్వామి శ్రీనివాసానంద పేర్కొన్నారు. తిమడాం గ్రామంలోని శ్రీ సీతారామ దేవస్థాన ప్రాంగణంలో నిర్వహించిన భాగవత సప్తాహం ముగింపు కార్యక్రమంలో ఆయన గురువారం పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ, నాలుగు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో భాగవత సప్తాహం నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భగవద్భక్తిలో లీనమవడం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించిందన్నారు. భీష్మ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక యాగం నిర్వహించి సప్తాహాన్ని ఘనంగా ముగించారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యం, మానసిక స్థైర్యం మరింత పెరుగుతాయని స్వామి శ్రీనివాసానంద ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



# శ్రీముఖలింగంలో భీష్మ ఏకాదశి ఏకాహం

**జలుమూరు, జనవరి 29(వార్త):** శ్రీముఖలింగంలో కొలువై ఉన్న రాధా గోవిందస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం ప్రత్యేక పూజలు, ఏకాహం భజన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ నిర్వహకులు మాట్లాడుతూ ప్రతి ఏడాది భీష్మ ఏకాదశి రోజున స్వామివారికి విశేష పూజలు నిర్వహించి, అనంతరం 24 గంటల పాటు ఏకాహం భజన కార్యక్రమాలు కొనసాగించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఈ ఏడాది కూడా గురువారం ఉదయం 6 గంటల నుంచి శుక్రవారం ఉదయం 6 గంటల వరకు 12 భజన మండలులతో ఏకాహం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ సభ్యులు వెల్లడించారు. పలు మండలాల నుంచి వచ్చిన భజన బృందాలు భక్తిగీతాలతో ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక వాతావరణంతో నింపాయి. కార్యక్రమంలో శ్రీ భీమేశ్వర భజనమండలి (శ్రీముఖలింగం), శ్రీ ఉమారామలింగేశ్వర భజనమండలి (కొమనాపల్లి), శ్రీ దేవి భజన మండలి (పాతపాడు), శ్రీ త్రినాథస్వామి భజన మండలి (సైరిగాం), శ్రీ రామాంజనేయ భజన మండలి (అగ్రహారం), శ్రీ వరసిద్ధి వినాయక భజనమండలి (దోమానాపల్లి), శ్రీ రాధా గోవిందస్వామి భజన మండలి



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## గ్రూప్--2లో సచివాలయ ఉద్యోగి వాసు విజయం



**సారవకోట, జనవరి 29(వార్త):** సారవకోట మండలం కొమ్మువరియా పల్లి గ్రామానికి చెందిన సచివాలయ ఉద్యోగి వాసు గ్రూప్--2 పరీక్షలో ఎంపికై జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. బుధవారం విడుదలైన గ్రూప్--2 ఫలితాల్లో ఆయన ఏఎస్ఓ (రూరా) -- జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ (ఈూణ) విభాగానికి ఎంపికయ్యారు. వాసు తండ్రి సింహాచలం రైతు కాగా, తల్లి సుశీల గృహిణి. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి కఠినమైన పోటీ పరీక్షలో విజయం సాధించడం అభినందనీయమని గ్రామస్థులు కొనియాడుతున్నారు. ప్రస్తుతం వాసు పాతపట్నం మండలం బోరుభద్ర సచివాలయంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు నిరంతర అధ్యయనం, క్రమశిక్షణతో లక్ష్యాన్ని సాధించిన వాసు యువతకు ఆదర్శంగా నిలిచారు. ఆయన విజయంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ విజయం మరింత ఉన్నత సేవలకు దారి తీయాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

# ఆధ్యాత్మికతతో మార్మోగిన యోగాశ్రమం

### -బొగాబందలో భక్తి, శ్రద్ధలతో భీష్మ ఏకాదశి



**మందస, జనవరి 29(వార్త):** ఆధ్యాత్మికతతో యోగాశ్రమం మార్మోగింది. వేదమంత్రోచ్చారణలు.. సంకీర్తనలు భక్తులను మంత్రముగ్ధులు చేశాయి. మందస మండలంలోని బొగాబందలో గల యోగాశ్రమంలో భీష్మ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆశ్రమ పీఠాధిపతి యోగిని లక్ష్మీభాయిమాతాజీ ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. ఆశ్రమ వ్యవస్థాపకుడు స్వామి భాస్కరదాస్ ఆశీస్సులతో భీష్మ ఏకాదశి, 41వ వార్షికోత్సవాలను నిర్వహించారు. ప్రాతఃకాలం 4గంటలకు సుప్రభాతం, అఖండజ్యోతి ప్రజ్వలన, శంఖధ్వనితో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పూజా కార్యక్రమాలు, సహస్రనామ అర్చనలు, విష్ణు సహస్రనామ పారాయణం, భైరిసారంగపురం పంచాక్షరి భక్తులతో శ్రీమద్భగవత్ గీతాపారాయణం, ప్రముఖ స్వామీజీలతో ప్రవచనములు, భక్త సమారాధన తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. బొగాబంద శ్రీవెంకటేశ్వర భజన బృందం, ఎకువూరు శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి భజన బృందం, గొప్పిలి శ్రీకాళీమాత భజన బృందం, భైరిసారంగపురం శ్రీపంచాక్షరి భజన బృందాలతో భజనా కాలక్షేపం జరిగాయి. రాత్రి ఏడు గంటలకు కన్నీటు బ్రతుకు అనే సాంఘిక నాటకం ప్రదర్శన జరిగింది. అనతరం పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో తుని నుంచి కళ్యాణి మాతాజీ, మందస నుంచి సుధాకర్ బాబాజీ, తూటిపురం నుంచి మాతా నెమలమ్మ మాతాజీతో పాటు ఇతర ప్రాంతాల నుంచి స్వాములు, గురువులు, పీఠాధిపతులు, ఆధ్యాత్మికవేత్తలు పాల్గొన్నారు.

## గోవిందపురం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌గా వెంకటమోహన్



**వజ్రపు కొత్తూరు, జనవరి 29 (వార్త):** పూండి-గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.వెంకటమోహన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ప్రిన్సిపాల్ గా పనిచేసిన రమేష్ పట్నాయక్ పదవీవిరమణ కావడంతో ఈయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వెంకట మోహన్ మాట్లాడుతూ 2019లో ఇక్కడ కళాశాల ప్రారంభం నుంచి రమేష్ కళాశాల అభివృద్ధి చేసారని, మరింతగా అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు. పరిసర ప్రాంతాల ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌లు, అధ్యాపకులు హర్షం వక్తం చేస్తూ అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఇచ్ఛాపురం ప్రిన్సిపాల్ శరత్ బాబు, మందస ప్రిన్సిపాల్ తేజేశ్వరరావు, పలాస ప్రిన్సిపాల్ నరసింహమూర్తి, నందిగం ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్, రామ్మోహన్ దొర, కేశ్వరావు, ఝాన్సీ, అన్ని కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## రబీ పంటల సాగుపై రైతులకు శిక్షణ



**కంచిలి, జనవరి 29(వార్త):** రబీ సీజన్లో ఆరుతడి పంటలు పండిస్తున్న రైతులకు నూనెగింజల జాతీయ మిషన్‌లో భాగంగా జిల్లా వనరుల కేంద్రం, శ్రీకాకుళం వారి ఆధ్వర్యంలో నువ్వులు, అపరాలు, వేరుశనగ పంటలలో మేలైన యాజమాన్య పద్ధతులపై కంచిలిలో రైతులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ పంటలలో ఎరువులు, యాజమాన్యం అలాగే పురుగులు తెగుళ్ల యాజమాన్య చర్యలు గూర్చి శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. రైతులు యొక్క సాగు సమస్యలకు శాస్త్రవేత్తలు పరిష్కారాలు తెలియజేశారు. యూరియా అధికంగా వాడడం వలన కలిగే దుష్ప్రభావాలను గూర్చి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ సిహెచ్ వెంకట్రావు, రాగోలు శాస్త్రవేత్త డాక్టర్ ఉదయ బాబు, మండల వ్యవసాయ అధికారి కొంక్యాన సురేష్, వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్ గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

## బెలగాం-శ్రీరాంపురం రోడ్డు పనుల ప్రారంభం



**కంచిలి, జనవరి 29 (వార్త):** కవిటి మండలం ఆర్.బెలగాం నుంచి కంచిలి మండలం కత్తివరం మీదుగా శ్రీరాంపురం గ్రామానికి వెళ్లే లింకు రోడ్డు పనులను గురువారం కంచిలి మండలం టిడిపి అధ్యక్షుడు మాదిన రామారావు ప్రారంభించారు. ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ కృషితో ఈ లింకు రోడ్డుకు కోటిన్నర రూపాయల నిధులు మంజూరైనట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామీణ రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు రామారావు పేర్కొన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పై ప్రధానంగా దృష్టి సారిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు కురయ్య టీవీ రమణ చిన్న బాబు జ్ఞాన రావు అశోక్ మన్మధరావు కామేసు శ్రీను పాల్గొన్నారు.

## ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



**పలాస, జనవరి 29(వార్త):** ఉగాది నాటికి ఇళ్లు నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్ పిడి రమాకాంత్ రావు అన్నారు. గురువారం పలాస కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో హౌసింగ్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉగాది నాటికి ఇళు నిర్మాణాలు పూర్తి చేయడానికి సంబంధించి, వివిధ హౌసింగ్ కార్యక్రమాలు పైన ఆరా తీశారు. అనంతరం రామకృష్ణాపురంలోని జగన్ లేఔట్ లో పరిశీలించారు. ఈ కార్యక్రమం లో పలాస మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసరావు, ఈ ఈ నరసింగరావు, హౌసింగ్ డిఈఈ సత్య, హౌసింగ్ సిబంది, మరియు ఏమిటీ సెక్రెటరీస్ పాల్గొన్నారు.

## పౌర సేవలపై సంతృప్తి పెంచడమే లక్ష్యం

### సీఎస్ సమీక్షలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం, జనవరి 30 (వార్త):** ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా, వేగంగా ప్రజలకు అందించడమే లక్ష్యంగా జిల్లాలో 'వాట్సాప్ గవర్నెన్స్'పై విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. గురువారం సాయంత్రం అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న వివిధ ప్రాధాన్యత అంశాలను కలెక్టర్ సీఎస్‌కు వివరించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా 'మన మిత్ర' యాప్ ద్వారా పౌర సేవలు పొందడంపై గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రధాన ఆలయాల్లో క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేసి, సేవలపై ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలను సేకరిస్తున్నామని, తద్వారా సంతృప్తి స్థాయిని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్వీ లక్ష్మణమూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కవిటి జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాస శిక్షణ



**కవిటి, జనవరి 29(వార్త):** కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం వ్యక్తిత్వ వికాస మరియు నైపుణ్య శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థకు చెందిన సర్టిఫికెట్ శిక్షణా నిపుణులు బి.గోవిందరావు పాల్గొన్నారు. విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా చదువుకోవాలని, అదే పనిగా చదువరాదని, మధ్య..మధ్యలో విశ్రాంతి తీసుకోవాలని, పొరపాటున పరీక్షలలో తప్పినా తప్పటడుగులు వేయరాదన్నారు. పరీక్షలు కంటే జీవితం ముఖ్యమని అన్నారు. ఎటువంటి నిర్ణయాలు తీసుకునేటప్పుడు తల్లిదండ్రులను గుర్తు చేసుకోవాలని సూచించారు. ప్రణాళికా బద్ధంగా చదివితే సులభంగా మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.సింహాచలం నాయుడు, జి. విష్ణుమూర్తి, పి.హరి, కే.ఉగాదినాయుడు, డి. అనసూయ, బి.శ్రీనుబాబు, జె.పాపారావు, కే.కరుణశ్రీ, డి.రమేష్, ఎల్.ఆనంద్, బి.అంజన, జనార్దనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జీడి పరిశ్రమలో విద్యార్థుల క్షేత్ర పర్యటన



**పలాస, జనవరి 29(వార్త):** రామకృష్ణపురములో ఉన్న శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులకు జీడిపరిశ్రమలో క్షేత్ర పర్యటన చేపట్టారు. రామక్రిష్ణపురములో ఉన్న శ్రీ సత్యసాయి విద్యావిహార్ 9వ తరగతి విద్యార్థిని విద్యార్థులు ఇండస్ట్రీ ఫీల్డ్ ట్రిప్ పేరుతో గురువారం పారిశ్రామికవాడలో ప్రముఖ జీడి వ్యాపారవేత్త శ్రీ కొరడా సంతోష్ ఎస్ ఎస్ ఎస్ ఇంటర్నేషనల్ జీడిపరిశ్రమ సందర్శించి ముడి సరుకు నుండి జీడిపప్పు తయారు వరకు దశలవారీగా పరిశీలించి అత్యాధునిక పద్ధతిలో జీడిపప్పు తయారీ విధానాన్ని నిశితంగా పరిశీలించి పారిశ్రామిక పరిజ్ఞానాన్ని పొందినారు. ఈ క్షేత్ర పర్యటనలో ఎస్-ఎస్ఎస్ ఇంటర్నేషనల్ అధినేత కోరాడ సంతోష్, ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, ఉపాధ్యాయులు కిరణ్, ఋషికెష్,గిరిధర్, గోపాల్ క్రిష్ణ, అనుదీప్ పాల్గొన్నారు.

## వైభవంగా ఆదిత్యుని కళ్యాణం

**అరసవల్లి, జనవరి 29 (వార్త):** ఆరోగ్య ప్రదాత ఉష,పద్మిని,ఛాయ సమేత సూర్యనారాయణ స్వామి వారి కళ్యాణం గురువారం ఉదయం 8 గంటలకు మాఘ శుద్ధ ఏకాదశి పురస్కరించుకొని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఆలయ కార్యనిర్వాహణాధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు సందీప్ శర్మ, వేద పండితులు వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి కళ్యాణం నిర్వహించారు.

## 3,4 తేదీల్లో హుండీ లెక్కింపు

అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానంలోని హుండీల లెక్కింపు వచ్చేనెల 3,4 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఈఓ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపార్టుమెంటు, అనువంశిక ధర్మకర్త, అర్చకులు, గ్రామ పెద్దల సమక్షం హుండీలను తెరచుటకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

## నేడు ఒరియా బ్రాహ్మణ సంఘం ఆత్మీయ సమ్మేళనం

**శ్రీకాకుళం, జనవరి 30 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని ఇలిసిపురం గుండిచ మందిరం ఆవరణలో శుక్రవారం ఉదయం పదకుండు గంటలకు ఒరియా బ్రాహ్మణ సంఘం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించనున్నట్టు సంఘం నిర్వాహకులు తెలిపారు. సమ్మేళనానికి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్ కుమార్ నాయక్, రాష్ట్ర ఒరియా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు శివాజీ పాణిగ్రాహి హాజరవుతారన్నారు. ద్వాదశిని పురస్కరించుకుని గుండిచా మందిరం ఆవరణలో మహా అన్న ప్రసాద వితరణ ఉంటుందని ప్రధాన అర్చకులు సుభాష్ పండా, సేవకులు బాలు పాణిగ్రాహి తెలిపారు. ఆత్మీయ సమ్మేళనం, ద్వాదశి మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి ఒరియా బ్రాహ్మణులు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు కోరారు.

## 31న ఎన్‌వైకేలో జాబ్ మేళా

**శ్రీకాకుళం, జనవరి 30 (వార్త):** నెహ్రూ యువ కేంద్రంలో ఈనెల 31న జాబ్‌మేళా ఉంటుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి కె. సుధ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్ టెల్ పేమెంట్ బ్యాంక్ కంపెనీలో రిటైల్ బ్యాంక్ మిత్ర ప్రమోటర్ ఉద్యోగానికి పదవ తరగతి విద్యార్హత గల 18-40 వయసు గల అర్హులన్నారు. జయభేరి ఆటోమోటివ్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్ సర్వీస్ అడ్వైజర్ పోస్టు కు ఇంటర్ లేదా డిగ్రీ ఉండి పురుషులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సర్వీసు అడ్వైజర్ పోస్టుకు డిప్లొమా లేదా బిటెక్ (మెకానికల్ /ఆటోమొబైల్) 18-35 వయసు పురుషులు, టెలీకాలింగ్ పోస్టుకు పదవ తరగతి లేదా ఆ పైన ఉద్యార్హత ఉండి స్త్రీలు మాత్రమే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వివరాలకు WWW.NCS.GOV.IN అనే వెబ్సైట్ లో నమోదు చేసుకొని హాజరుకావాలన్నారు.

# ప్రభుత్వ భూములపై అక్రమార్కుల కన్ను

### * తెర వెనుక అధికారి పార్టీ నాయకుల బాగోతం * పలాసలో కోట్లు విలువైన ప్రభుత్వ భూములు స్వాహా



**పలాస, జనవరి 29 (వార్త):** పలాసలో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోతోంది. ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు అక్రమార్కులు గద్దల్లా వాలిపోతున్నారు. కొంతమంది అధికారులకు తాయిలాలిస్తూ, అధికార పార్టీ నేతల అండతో భూములు ఆక్రమించేస్తున్నారు. పలాస పురుషోత్తపురం సూదికొండ సర్వే నెం- 51లో ప్రభుత్వ భూమిని ఆక్రమించేవారు. కాశీబుగ్గ సర్వే నెం-234, పద్మనాభపురం సర్వే నెం-395 వేసి తప్పుడు రిజిస్ట్రేషన్‌తో ప్రభుత్వ భూమిని అమ్మకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. పలాస పద్మనాభపురం రెవెన్యూ గ్రామంలో సర్వే నెం-362లో ఉన్న వరదకాలువను ఆక్రమించి కోట్లాది రూపాయలు సొమ్ములు చేసుకున్నారు. దీనివెనుక అధికార పార్టీ నేతలు ఉన్నట్టు గుసగుసలు ఉన్నాయి. గత వైస్సార్సీపీ ప్రభుత్వం హయాంలో ఇదే భూముల్లో అప్పటి ప్రభుత్వ యంత్రాంగం సబ్ కలెక్టర్ వికాస్ మర్మట్ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అధికారపార్టీకి చెందిన కొంతమంది అక్రమార్కులు హెచ్చరిక బోర్డులను తొలగించి ఆ భూములను కబ్జా చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే అధికార పార్టీకి చెందిన కొందరు బెదిరింపులు, దాడులు, కేసులు పెడుతున్నారు.

## స్టడీ మెటీరియల్ పంపిణీ



**శ్రీకాకుళం టౌన్, జనవరి29 (వార్త):** డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అనుబంధం విద్యా సామాజిక సేవా విభాగం జాతీయ ఉపాధ్యాయ సేవాదళ్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమాన్ని శ్రీకాకుళం ఉప విద్యాశాఖ అధికారి ఆర్. విజయ కుమారి ఆవిష్కరించారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని బలగ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఉరిటి రామనాథం ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె పుస్తకాలను ఆవిష్కరించి, సంబంధిత బోధనా ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ తరహా మెటీరియల్ పంపిణీ చేసిన ఉపాధ్యాయ సేవాదళ్‌ను ఉప విద్యాశాఖ అధికారి అభినందించారు. విద్యార్థులకు ఎంతో ఉపయుక్తమైన ప్రశ్న పత్రాలు, సమాధానాలకు సంబంధించిన అంశాలను పొందుపరిచే పుస్తకాన్ని రూపొందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సేవాదళ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి శ్రీనివాసరావు ఉపాధ్యాయ సేవా దళ్ రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. విజయవాడ శ్రీ వివేకానంద ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మార్చిలో జరగనున్న పరీక్షలకు సంబంధించి ఫైనల్ రివిజన్ సంచికను ప్రచురించి పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. పాఠశాలలో పేద విద్యార్థులకు ఇతోధికంగా సహాయ కార్యక్రమాలు కూడా చేపడుతున్నట్లు వెల్లడించారు. సహాయం పొందేందుకు అవసరమైన విద్యార్థులను గుర్తించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామనాథం మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయుక్తమైన ఈ తరహా కార్యక్రమాలు ప్రశంసనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్ని వసతులతో కార్గిల్ పార్కు అభివృద్ధి

**శ్రీకాకుళం టౌన్, జనవరి 30 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో కార్గిల్ పార్కు అత్యధికమైన వసతులతో అభివృద్ధి చేస్తున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కమిషనర్, సుడా అధికారులతో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. శ్రీకాకుళం నగర వాసులకు ఒక ఆహ్లాదకరమైన అనుభూతిని కల్పించే విధంగా ఓ పార్కును అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అంతా కలిసి కార్గిల్ పార్కు అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టమని తెలిపారు. సూడా సహకారంతో పార్కును అభివృద్ధి చేస్తున్నామని, పార్కులో రీడింగ్ రూమ్, మినీ ఓపెన్ థియేటర్, బాక్స్ క్రికెట్, సెటిల్ కోర్ట్, కార్గిల్ వీరుల విజయ పతాకం, వంటి ఎన్నో వ్యాయామ ఉపకరణాలు ఏర్పాటు, అనేక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ పార్కు మరో మూడు నెలల్లో అందుబాటులోకి వస్తుందని, రాష్ట్రంలోనే ఒక మంచి గుర్తింపు పొందిన కార్గిల్ పోర్కుగా రూపకల్పన చేస్తున్నామని పేర్కొన్నారు. కలెక్టరేట్ నుండి పీజీ పేట వరకు రోడ్డు వెడల్పు చేస్తున్నామని, నాగావళి రివర్స్ సైడ్ అభివృద్ధి కూడా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. స్థానిక కూటమి నాయకులు, మున్సిపల్ కమిషనర్, హెల్త్ ఆఫీసర్, సూడా ఎస్ఈ, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.







## ఆమదాలవలస కేవీకేకు రాష్ట్ర స్థాయి పురస్కారం

**ఆమదాలవలస, జనవరి 29(వార్త):** అన్నదాతలకు అండగా నిలుస్తూ, సాగులో ఆధునిక మెళకువలను చేరువ చేస్తున్న ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) రాష్ట్ర స్థాయిలో సత్తా చాటింది. ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కేంద్రాల్లో 2024-25 సంవత్సరానికి గాను 'ఉత్తమ విస్తరణ సేవల' విభాగంలో ఆమదాలవలస కేవీకే ప్రథమ స్థానంలో నిలిచింది. గుంటూరులోని లామ్ ఫాంలో జరిగిన పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశంలో ఈ అవార్డును ఘనంగా ప్రదానం చేశారు. వర్సిటీ ఉపకులపతి డాక్టర్ ఆర్. శారదా జయలక్ష్మిదేవి చేతుల మీదుగా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి ఈ అవార్డును అందుకున్నారు. జిల్లాలో సాగు ఉత్పాదకత పెంపునకు, రైతులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ కేవీకే చేస్తున్న కృషిని ఉపకులపతి ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రశంసించారు. అవార్డు సాధనలో కీలక పాత్ర పోషించిన కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ సి.హెచ్. బాలకృష్ణ, డాక్టర్ బి. సునీత, డాక్టర్ వి. హరికుమార్లను వర్సిటీ విస్తరణ సంచాలకులు డాక్టర్ జి. శివనారాయణ, పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి.వి. సత్యనారాయణ అభినందించారు. ఈ గుర్తింపు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు స్ఫూర్తినిస్తుందని కేవీకే ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేశారు.

## మహిళను కాపాడిన పోలీసులు

**శ్రీకాకుళం క్రైం, జనవరి 29 (వార్త):** పోలాకి మండలానికి చెందిన ఒక మహిళ గురువారం ఉదయం ఇంటి నుండి బయటకు వెళ్లింది. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంటానని తన కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలియజేసింది. ఈ సమాచారంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెంటనే అత్యవసర సేవల నంబర్ 112 కు కాల్ చేసి సమాచారం అందించారు. 112 కంట్రోల్ రూమ్ సిబ్బంది వెంటనే పోలాకి పోలీసులకు సమాచారం అందించారు. పోలాకి ఎస్ఐ రంజిత్ కుమార్ తక్షణమే స్పందించి ఆమెతో నిరంతరం మాట్లాడుతూ సాంకేతిక సమాచారం ఆధారంగా సదరు మహిళ ఉన్న ప్రాంతాన్ని గుర్తించారు. ఆమె ఆమదాలవలస పరిసర ప్రాంతంలో ఉన్నట్లు నిర్ధారణ కావడంతో, వెంటనే ఈ సమాచారం ఆమదాలవలస పోలీసులు, జీఆర్‌పి పోలీసులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వేగంగా సంఘటనా స్థలానికి చేరుకొని సదరు మహిళను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఆమెకు కౌన్సెలింగ్ అందించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. 112 సిబ్బంది, పోలాకి పోలీసులు, ఆమదాలవలస పోలీసులు, జీఆర్‌పి పోలీసుల సమన్వయంతో సమయస్ఫూర్తిగా చేపట్టిన చర్యల వల్ల ఒక మహిళ ప్రాణాలు కాపాడగలిగామని ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి పేర్కొంటూ సంబంధిత పోలీసు సిబ్బందిని అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఆలస్యం చేయకుండా వెంటనే 112కు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ కోరారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546